సాక్షి
నిర్మల్
గురువారం । 9 । మార్చి । 2023



ఉత్తమ ఫలితాల కోసం..
8లో▸

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తోంది.



వనితా.. నీకు వందనం

జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.
9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 / 19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా, ఉక్కపోతగా ఉంటుంది. చలి తగ్గుతుంది.

మరోసారి అవార్డు అందేనా?

- అవార్డు బరిలో నిర్మల్ జిల్లా ఆస్పత్రి
- గతేడాది కాయకల్పలో నంబర్‌వన్
- మెరుగైన సేవలకు గుర్తింపుగా ఎన్‌–క్వాస్
- నేడు జిల్లా ఆస్పత్రికి కాయకల్ప బృందం



ఇటీవల జిల్లా ఆస్పత్రిలో పర్యటించిన ఫెయిర్ అసెస్మెంట్ టీం

నిర్మల్‌చైన్‌గేట్: ఇప్పటికే ఒకసారి కాయకల్ప అవార్డు సాధించిన జిల్లా ఆస్పత్రి మరోసారి రేసులో ఉంది. గత డిసెంబర్‌లో ఉట్నూరుకు చెందిన ఫేర్ అసెస్మెంట్ టీం జిల్లా ఆస్పత్రిలో సేవలు బాగున్నాయని పేర్కొంది. మరోసారి కాయకల్ప అవార్డు పోటీకి అర్హత ఉందని రిపోర్టు అందజేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఫైనల్ టీం జిల్లా ఆస్పత్రిని సందర్శించనుంది. అవార్డు పొందడానికి అన్ని విధాలా అర్హత ఉన్నాయని ఆస్పత్రి వైద్యాధికారులు చెబుతున్నారు. నూతన భవన నిర్మాణం, బెడ్లు, ఆక్సిజన్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్ ఉండగా ఉత్తమ సేవలందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. డయాలసిస్ సేవలూ అందిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండడంతోపాటు ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయి. అయితే ఆస్పత్రిలో బెడ్ల సంఖ్య సరిపోకపోవడం మైనస్‌గా మారే అవకాశం ఉంది.

18 అంశాల పరిశీలన

జాతీయ పరిశీలన బృందం ఆస్పత్రిలోని 18 అంశాలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేస్తుంది. సేవల్లో నాణ్యతాప్రమాణాలు, వైద్య పరికరాలు, భవన నిర్మాణాలు, పారిశుధ్య నిర్వహణ, బయోమెడికల్ వేస్టేజ్ నిర్వహణ, సర్జరీల్లో ఇన్ఫెక్షన్ ఆపరేషన్, లేబర్ రూం విభాగాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలు, రికార్డుల నిర్వహణ, యోగా, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం, ప్లాస్టిక్ నిషేధిత చర్యలు, మొక్కల పెంపకం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

94శాతం మార్కులతో ఎన్‌క్వాస్..

ప్రజలకు సేవలందించే సర్కారు ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి జాతీయ నాణ్యత హామీ పత్రాలు అందిస్తోంది. మెరుగైన వైద్య సేవలతోపాటు మాతాశిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఏటా కేంద్ర ఆరోగ్యశాఖ ప్రభుత్వ ఆస్పత్రులకు 'నేషనల్ హెల్త్ మిషన్' పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 'నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ (ఎన్‌–క్వాస్) మార్గదర్శకాల ప్రకారం కేంద్రబృందం గతేడాది మే 10, 11, 12 తేదీల్లో జిల్లాలో పర్యటించింది. జిల్లా ఆస్పత్రి, ప్రసూతి ఆస్పత్రులను సందర్శించి వైద్యసేవలను పరిశీలించింది. ఈ నివేదిక ఆధారంగా గత జూన్‌లో కేంద్రం ప్రకటించిన జాబితాలో జిల్లా ఆస్పత్రి 94 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఆస్పత్రిలోని ఒక పడకకు ఏడాదికి రూ.10వేల చొప్పున మూడేళ్ల పాటు పారితోషికం అందజేస్తున్నారు.

పురస్కారాలు ఇచ్చేదిలా..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పత్రుల పనితీరును అనుసరించి కాయకల్ప అవార్డు కింద ఏటా ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొదటి బహుమతి సాధించిన జిల్లా ఆస్పత్రులకు రూ.50 లక్షలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రూ.15 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.2 లక్షలు, సబ్‌సెంటర్లకు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం అందిస్తుంది. ఈ నెల ముజ్గి ఆరోగ్య కేంద్రానికి కాయకల్ప అవార్డు వచ్చింది.

రూ.50 లక్షలకు రూ.25 లక్షలే..

రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ కాయకల్ప అవార్డుల కోసం రాష్ట్రంలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలకు మార్కులు ఇచ్చింది. ఇందులో భాగంగా గత జూలైలో ప్రకటించిన కాయకల్ప అవార్డుకు మొదటి స్థానంలో ఎంపికైన జిల్లా ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.50లక్షల నగదు పురస్కారం అందజేయాలి. కానీ.. నిర్మల్ ఆస్పత్రితో పాటు తాండూరు జిల్లా ఆస్పత్రి 92 శాతం మార్కులతో ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. రెండు ఆస్పత్రులకూ సమాన మార్కులు రాగా రూ.50లక్షల నగదు పురస్కారాన్ని రెండు ఆస్పత్రులకు రూ.25లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది.

మెరుగైన సేవలందిస్తున్నాం



అవార్డు కోసమే అని కాకుండా ఆస్పత్రిలో రోగులందరికీ డాక్టర్లు, సిబ్బందితో మెరుగైన సేవలందిస్తున్నాం. జాతీయ పరిశీలన బృందం పలు విభాగాల్లో ఆస్పత్రిని పరిశీలిస్తుంది. ప్రతీ విభాగంలో 70 శాతం పాయింట్లు లభిస్తే రూ.50 లక్షలు బహుమతిగా వస్తుంది. గతంలో కాయకల్ప ఎన్‌–క్వాస్ అవార్డు సొంతం చేసుకున్నాం. మరోసారి అవార్డు దక్కించుకునేందుకు కృషి చేస్తున్నాం.

– డా.దేవేందర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

న్యూస్‌రీల్

సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



సీఎస్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆమెకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ సమస్యలపై ఆమెతో చర్చించారు.

గురుకుల పాఠశాల సందర్శన



గురుకుల పాఠశాల వద్ద ట్రైనీ కలెక్టర్లు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ట్రైనీ కలెక్టర్లు ఐదోరోజూ పర్యటించారు. ట్రైనీ కలెక్టర్లు సందీపన్ సర్కార్, బంటి కుమార్, ఆలీషాఖానం, ప్రీతంసేన్, సౌమ్య బుదిరాజా బుధవారం రేషన్‌షాప్‌నకు వెళ్లి రేషన్ పంపిణీని పరిశీలించారు. సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో వెంకటేశ్, సర్పంచ్ బొడ్డు గంగన్న, ఏపీవో జయదేవ్, కార్యదర్శి మనోజ్ తదితరులున్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



జౌలా(బీ)లో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

తానూరు: గ్రామాల శుభ్రతపై దృష్టి సారించాలని డీపీవో శ్రీలత సూచించారు. బుధవారం మండలంలోని జౌలా(బీ), తానూరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. ప్రతీరోజు పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువు తయారయ్యేలా చూడాలని చెప్పారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పల్లెప్రకృతి వనాలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి మతీన్, సర్పంచ్ సాతప్ప తదితరులున్నారు.

ఆదివాసీలు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న పీపీ వినోద్‌రావు

ఖానాపూర్: ఆదివాసీలు ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని నిర్మల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి ఇప్పమాడ గ్రామంలోని ఆదివాసీలకు జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పీపీ హాజరై మాట్లాడారు. విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని కుటుంబాల్లోని పురుషులు, మహిళలు, పిల్లలకు చీరెలు, డ్రెస్ మెటీరియల్స్ అందజేశారు. నాయకులు మిర్యాల హరిత, ప్రతాప్‌రావు, సాగి పెద్దలక్ష్మణ్‌రావు, జననీ ఫౌండేషన్ అధ్యక్షుడు తోట సుమీత్, న్యాయవాది వెంకట్‌మహీంద్ర, నాయకులు మదిరె శ్రీనివాస్, అభిషేక్, రాజు తదితరులున్నారు.

నేడు వివిధ సంస్థలతో ఒప్పందం

భైంసా: బాసర ఆర్జీయూకేటీ గురువారం హైదరాబాద్‌లోని అరణ్య భవనంలో వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందం చేసుకోనుంది. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నాక్ సంస్థలతో ఒప్పందం చేసుకుంటుంది. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వర్సిటీ వీసీ వెంకటరమణ, డాక్టర్ రజత్‌కుమార్ సమక్షంలో వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, మరుపాక నగేశ్ అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకోనున్నారు. ఈ ఒప్పందంతో విద్యార్థులు, అధ్యాపకులకు పరిశోధన, శిక్షణ, ఉపాధి, ఉద్యోగావకాశాల్లో పరస్పర సహకారం అందించుకోవచ్చని డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు.

చేపల మార్కెట్ పరిశీలన



విక్రయదారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక చేపల మార్కెట్, పశు సంవర్ధకశాఖ కార్యాలయాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేపల మార్కెట్‌లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సుభాష్‌చందర్ తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న అంబాజీ

భైంసాటౌన్: భైంసాలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం డీటీడబ్ల్యూవో అంబాజీ సందర్శించారు. మంగళవారం పాఠశాలలో నీటి సరఫరా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థినుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులు నీటి కోసం బయటకు వెళ్లడంపై ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బాధ్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఏసీఎంవో శివాజీ, హెచ్‌ఎం భోజారాం, ఉపాధ్యాయులున్నారు.

మహిళల పక్షపాతి సీఎం కేసీఆర్



ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఆస్పత్రుల్లో 'ఆరోగ్య మహిళ' ప్రారంభం
- పలువురికి కేసీఆర్ కిట్లు అందజేత

నిర్మల్‌చైన్‌గేట్: మహిళల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తూ సీఎం కేసీఆర్ మహిళల పక్షపాతిగా నిలిచారని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా ప్రసూతి ఆస్పత్రి, బంగల్‌పేట్ అర్బన్ పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసూతి వార్డులో గర్భిణులతో మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు. మహిళా దినోత్సవం రోజు ఆడ శిశువులను ప్రసవించిన మహిళలకు కేసీఆర్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ మహిళ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆరోగ్య మహిళ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని చెప్పారు. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 100 పీహెచ్‌సీలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 దవాఖానాల్లో సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో ప్రతీ మంగళవారం మహిళా క్లినిక్‌లు నిర్వహిస్తారని, మహిళలకు ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. 57 రకాల వైద్య పరీక్షలు చేస్తారని, ఉచిత సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం 50 పడకలతో కొనసాగుతున్న ప్రసూతి ఆస్పత్రిని త్వరలో 150 పడకలకు విస్తరిస్తామని తెలిపారు. 100 పడకలతో కొనసాగుతున్న జిల్లా ఆస్పత్రిని అయ్యప్ప టెంపుల్ దగ్గర నిర్మిస్తున్న భవనంలో మరో 300 పడకలతో జిల్లా ఆస్పత్రి కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో కలిసి మంత్రి కేక్ కట్ చేశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవలు కొనియాడారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి ధనరాజ్, డీసీహెచ్‌ఎస్ దేవేందర్‌రెడ్డి, డాక్టర్ రజిని తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో 279 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి ఐకేరెడ్డి పంపిణీ చేశారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, ఏఎంసీ చైర్మన్ రమణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్ పరిశీలన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి సీఎం కేసీఆర్ త్వరలో రానున్న నేపథ్యంలో మంత్రి ఐకేరెడ్డి తెలంగాణ (బీఆర్‌ఎస్) భవన్‌ను పరిశీలించారు. ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం, జెండా దిమ్మెను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టరేట్ భవన సముదాయం, తెలంగాణ (బీఆర్‌ఎస్) భవన్ ప్రారంభం, మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడానికి సీఎం జిల్లాకు రానున్నారని తెలిపారు. త్వరలో పర్యటన ఖరారు కానుందని చెప్పారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకల రాంచందర్, ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, నాయకుడు మారుగొండ రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న ఉద్యోగులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ప్రభ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రభకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెను అభినందించారు.

పాండ్వపూర్ మహిళా సంఘానికి..

కడెం: పాండ్వపూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘం ఉత్తమ మహిళా సంఘం అవార్డును సొంతం చేసుకుంది. బుధవారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి అవార్డు కింద రూ.5వేలు చెక్ సంఘం సభ్యులకు అందించారు. ఫౌండేషన్ డీపీవో లక్ష్మణ్, ఏపీఎం రాజారాం, సీసీ స్వామి తదితరులున్నారు.

ముధోల్ సరస్వతి సమాఖ్యకు..

ముధోల్: ముధోల్ మండల సరస్వతి సమాఖ్య శ్రీనిధిలో జిల్లాలో మొదటి స్థానంలో నిలువగా జిల్లా కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం ఏపీఎం అశోక్, మండల సమాఖ్య సభ్యులకు అవార్డు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల మహిళలకు ఇచ్చిన రుణాలు సమయానికి రికవరీ చేసి మళ్లీ రుణాలు పొంది ఎంతో అభివృద్ధి చెందారని ఈ సందర్భంగా ఏపీఎం తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఏపీఎం, సభ్యులు

దిలావర్‌పూర్ మండల సమాఖ్యకు..

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ మండల సమాఖ్య జిల్లాలో రెండో స్థానంలో నిలువగా జిల్లా కేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి సమాఖ్య సభ్యులకు అవార్డు అందజేశారు. ఏపీవో సులోచన, సీసీలు, సిబ్బంది, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ముధోల్ ఏపీవోకు..

భైంసాటౌన్: ముధోల్ ఈజీఎస్ ఏపీవో ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డు అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి శిరీషకు అవార్డు అందజేశారు.

మహిళలు అధైర్య పడొద్దు

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవం



మహిళలతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: మహిళలు అధైర్య పడకుండా అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు మంత్రి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఆర్డీవో ఆధ్వర్యంలో రూపొందించిన మహిళల గొప్పతనాన్ని చాటే షార్ట్ ఫిలింను తిలకించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళల రక్షణకు సఖీ కేంద్రాలు, షీ టీమ్స్ ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ మహిళలకు ఉద్యోగాల్లో ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీనిధి రుణాల పంపిణీలో జిల్లా తెలంగాణలోనే రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఆర్డీవో స్రవంతి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, జిల్లా అధికారులు, మహిళా ప్రజాప్రతినిధులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకురాళ్లు

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం టీఎన్జీవో సంఘ భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో జిల్లా అధ్యక్షురాలు సమత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్రం మహిళలకు వంటగ్యాస్ పెంపును కానుకగా ఇచ్చిందని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మహిళలకు ప్రోత్సాహం కరువైందని, పని ప్రదేశాల్లో నేటికీ వేధింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పురుషులతోపాటు మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగానే చూస్తోందని, ఫలితంగా ఒంటరి మహిళలతో పాటు అనేక కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. మద్యాన్ని వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, జిల్లా నాయకులు భీమక్క, గంగామణి, కమల, రుక్మ, అంజలిబాయి, లక్ష్మి, కవిత, రాజమణి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న, ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, మహేందర్ పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలోని బీరప్ప ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రేఖానాయక్ రూ.3లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహాత్మా జ్యోతీబాపూలె పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, పీఆర్టీయూ భవన్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంకం రాజేందర్, ఖలీల్, మోహిద్, పుప్పాల శంకర్, విజయలక్ష్మి, ప్రదీప్, రాజగంగన్న, బీరయ్య, నర్సయ్య, మల్లేశ్, మల్లయ్య, రమేశ్ తదితరులున్నారు.

ఘనంగా బీరప్ప దేవుని జాతర



ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో బీరప్ప దేవుని జాతర బుధవారం వైభవంగా జరిగింది. సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు నాగవెల్లి పట్నం వేశారు. మంగళవారం రాత్రి నాగవెల్లి బోనాలు సమర్పించారు. కరీంనగర్ జిల్లా బీర్ల పూజారి అమరగొండ భిక్షపతితో పాటు తిరుపతి, బండారి శ్రీనివాస్, బైరి మల్లేశ్ కళాబృందం ఆధ్వర్యంలో ఒగ్గుకథ చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ది నర్సయ్య, పెద్ది బీరయ్య, పెద్ది మల్లేశ్, నర్సయ్య, రమేశ్, బీరయ్య తదితరులున్నారు.

'మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుదాం'



మాట్లాడుతున్న హరిత

భైంసాటౌన్: సమాజంలో మహిళల మనుగడకు పెనుప్రమాదంగా మారిన మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.హరిత పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అణగారిన వర్గాలు, దళితులను వివక్షకు గురిచేయడం, విద్య, వికాసం, సౌకర్యాలకు దూరం చేయడం, అగ్రవర్ణాలకు ఊడిగం చేయడం మనువాదం విధానమని, అందుకే దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, జ్యోతి, విద్యార్థులున్నారు.

క్లుప్తంగా

కూతుర్ని తీసుకొస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని తండ్రీకూతుర్లకు గాయాలు
- చికిత్స పొందుతూ తండ్రి మృతి


షేక్ హుస్సేన్ (ఫైల్)

లోకేశ్వరం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తండ్రి మృతిచెందగా కూతురుకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్(57) పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం అత్తగారింటి నుంచి కూతురు వస్తుందని తెలిసి నిర్మల్‌కు తన బైక్‌పై వెళ్లాడు. కూతురు లాల్‌బి, మనవరాలును తీసుకుని బైక్‌పై నిర్మల్ నుంచి లోకేశ్వరం బయలుదేరాడు. మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని అర్లి వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ హుస్సేన్, లాల్‌బీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


నరేశ్ మృతదేహం

లక్ష్మణచాంద: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోన్ మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నరేశ్ (30) బొప్పారం గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సెంటర్ సక్రమంగా నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం న్యూవెల్మల్ గ్రామ శివారులోని సరస్వతీ కాలువ సమీపంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

రూ.25లక్షలతో వ్యాపారి పరారీ

ముధోల్: మండలంలోని వితోలి గ్రామ సమీపంలో మైనింగ్ కంపెనీలో ఇన్‌చార్జి వ్యాపారిగా నెల్లూరు జిల్లాకు చెందిన అశోక్ కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ముధోల్ మండలానికి చెందిన దప్కల్ విఠల్ వద్ద నుంచి రూ.3.50లక్షలు, అస్‌లామ్ వద్ద రూ.13 లక్షలు, జీకే పెట్రోల్‌లో రూ.లక్షా 10వేలు, ఇండియన్ పెట్రోల్ బంక్‌లో రూ.7లక్షలు గత 20రోజుల క్రితం తీసుకున్నాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో సదరు బాధితులు ఐదు రోజుల క్రితం నెల్లూరు జిల్లాకు వెళ్లి అతడి ఇంటి వద్ద వాకబ్ చేశారు. అతడి భార్య ఇంటికి రాలేదని సమాధానం ఇచ్చింది. దీంతో చేసేది లేక బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ ఫలితాల కోసం..


కాంప్లిమెంటరీ బృందాలతో విద్యార్థులకు అవగాహన

- వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు
- లక్ష్యం దిశగా మిషన్ లక్ష్యం
- సత్ఫాలితాలిస్తున్న అభ్యాసదీపికలు

ఉట్నూర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మిషన్ లక్ష్యం అమలు చేస్తుండగా విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస దీపికలు అందించడంతో పాటు విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతేకాకుండా కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలుండగా దాదాపు 34వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 3851 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 1735 మంది విద్యార్థులు, ఆసిఫాబాద్ జిల్లాలో 1248 మంది విద్యార్థులు, నిర్మల్ జిల్లాలో 452 మంది విద్యార్థులు, మంచిర్యాల జిల్లాలో 416 మంది విద్యార్థుల చొప్పున హాజరు కానున్నారు.

ఫలితాల సాధనకు మిషన్ లక్ష్యం...

పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గత డిసెంబర్ 7వ తేదీ నుంచి వందరోజుల మిషన్ లక్ష్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా వంద రోజుల పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రతి రోజు ఉదయం గంట పాటు నాలెడ్జ్ అసిస్‌మెంట్, పరీక్షల నిర్వహణతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా పాఠ్యాంశాల వారీగా ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాలు ముద్రించి గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను విభజించి టెస్టులు నిర్వహించడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులను గ్రూపులుగా దత్తత ఇవ్వడం, కార్పొరేట్ స్థాయిలో జవాబు పత్రాలు ముద్రించి విద్యార్థులతో అభ్యసనం చేయించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా అభ్యాస దీపికలు అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.


విద్యార్థులకు అందించిన అభ్యాస దీపికలు

కాంప్లిమెంటరీ బృందాలు..
ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఈసారి 11పేపర్లకు బదులుగా ఆరు పేపర్ల విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుండడంతో పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గిరిజన సంక్షేమశాఖ 14 కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాల సభ్యులు విద్యార్థులకు పరీక్షా విధానం, నూతన మాదిరి ప్రశ్నాపత్రాలతో పరీక్షలు ఎలా రాయాలి, పరీక్ష రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను ఆశ్రమ పాఠశాలల వారీగా ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించాయి.

నిర్మాణ్ సంస్థ ద్వారా అవగాహన
పదో తరగతి అనంతరం విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ఉన్నత విద్య కోసం ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేందుకు ఎలా ముందుకు సాగాలి తదితర అంశాలపై పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు నిర్మాణ్ సంస్థ ద్వారా గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు.


ఉన్నత విద్య కోసం విద్యార్థులకు అవగాహన

పరీక్ష సామగ్రి... ప్రత్యేక మెనూ..
వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక మెనూ అమలు చేయడంతో పాటు సూపర్‌విజన్ తరగతుల సమయంలో విద్యార్థులు అలసిపోకుండా పాలు, స్నాక్స్, టీతో పాటు ప్రత్యేక పోషకాహారం అందించనున్నారు. అంతేకాకుండా పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి చేతి గడియారం, జామెట్రీ బాక్స్, పరీక్ష ప్యాడు, పెన్నులు, లాంగ్ స్కెల్‌లను ప్రత్యేకంగా అందించనున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. మిషన్ లక్ష్యం అమలుతో పాటు ఇతర ప్రత్యేక చర్యల ద్వారా విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. అంతేకాకుండా భవిష్యత్‌లో ఉన్నత విద్యాభ్యాసన కోసం ఎలా ముందుకు సాగాలి తదితర అంశాలపై నిర్మాణ్ సంస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జగన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఐటీడీఏ

యువతి అదృశ్యం

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బొమ్మెన సంగీత -శ్రీనివాస్ దంపతుల పెద్ద కూతురు బొమ్మెన లక్ష్మిప్రసన్న(19) నిర్మల్ జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి సుమారు 9.30 గంటల నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో యువతి తల్లి బొమ్మెన సంగీత ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్‌గౌడ్ పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి అశోక్‌రెడ్డి(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌రెడ్డి కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం చేనుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇదే విషయం తన సోదరునికి ఫోన్‌లో సమాచారం అందించాడు. కుటుంబీకులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కాగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మైకంలో యువకుడి ఆత్మహత్య

జైనథ్: బేల మండలం బెదోడ గ్రామానికి చెందిన కె.స్వామి(28) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... స్వామి రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం పండుగ సందర్భంగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు తాగుడు బంద్‌చేయాలని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన స్వామి మండలంలోని ఖాప్రి సమీపంలోని పాత వంతెన వద్ద తాగిన మైకంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఆత్మరాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గొడవ ఆపేందుకు వెళ్లి..

ప్రాణాలు పోగొట్టుకున్న బాలుడు
- హోలీ రోజు కొలాంగూడలో విషాదం
- మద్యం మత్తులో ఇద్దరు మైనర్ల గొడవ..
- అడ్డుకునేందుకు వెళ్లిన బాలుడు
- తోసివేయడంతో సీసీరోడ్డుపై పడిన వైనం..


భీంరావు (ఫైల్)

నార్నూర్: హోలీ పండుగపూట మండలంలోని కొత్తపల్లి – హెచ్ కొలాంగూడలో మంగళవారం తీవ్ర విషాదం నెలకొంది. సీఐ ప్రేమ్‌కుమార్ వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి గ్రామంలో ఇద్దరు బాలురు మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఆ గొడవ ముదరడంతో అక్కడే ఉన్న కొడప దేవురావు (15) ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. వారు నెట్టివేయడంతో పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై దేవురావు పడిపోయాడు. తలకు తీవ్రంగా దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి మృతికి కారణమైన ఇరువురిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి సోనేరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి జాలరి మృతి


తోకల నరేశ్ (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని సాథ్గాం గ్రామానికి చెందిన జాలరి గోదావరిలో ప్రమాదశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... నరేష్(25) చేపల వేటకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే బుధవారం తెల్లవారు జామున ఇంటి నుంచి వలలు తీసుకుని గోదావరి నదిలోకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చేపట్టారు. గోదావరి ఒడ్డున బైక్, దుస్తువులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య హరీష, రెండేళ్ల కూతురు ఉన్నారు.

వాచ్‌మన్ హత్య

- బంధువుల ఆందోళన
- సంఘటన స్థలంలో స్వల్ప ఉద్రిక్తత
- పరిశీలించిన ఎస్పీ, ఏఎస్పీ


షేక్ అహ్మద్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని భోకర్ రోడ్డులోని ఓ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్ హత్యకు గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం .. సిరాల గ్రామానికి చెందిన షేక్ అహ్మద్(60) భైంసాలోని ఓ ఫ్యాక్టరీలో కొద్దికాలంగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం స్థానిక పశువుల కాపర్లు మృతదేహం గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ ఎల్. శ్రీను చేరుకుని సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల కోసం పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇది హత్యేనంటూ ఆరోపించారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని కదలనివ్వబోమని పట్టుబట్టడంతో కొంతసేపు స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసులు వారిని సముదాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలో పనిచేసే కొందరు బిహార్ కూలీలు పరారీలో ఉన్నారని, వారే మంగళవారం రాత్రి హత్య చేసి ఉంటారని, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు వారంరోజుల్లో ఛేదించారు. మండల కేంద్రంలో సర్కిల్ కార్యాలయంలో బుధవారం భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించాడు. మండలంలోని ముద్గల్ గ్రామానికి చెందిన టోక్రేకర్ లత గత నెల 21వ తేదీన భర్త చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి ఇంటికి తాళం వేసి వెళ్లింది. గమనించిన అదే గ్రామానికి చెందిన టోక్రేకర్ శుద్ధోదన్ మార్చి 01న రాత్రి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇనుపపెట్టెలోని రూ.లక్షా 20 వేల నగదు దొంగిలించాడు. మరుసటి రోజు విషయం తెలుసుకున్న లత ఇంటికి చేరుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు దొంగిలించిన డబ్బును తన ఇంట్లో దాచిపెట్టి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా భోకర్ తాలుక నాంద గ్రామంలోని అత్తింటికి వెళ్లాడు. బుధవారం ఉదయం మండలంలోని సరస్వతీనగర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా తిరుగుతున్న శుద్ధోదన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం ఒప్పుకున్నాడు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఏఎస్పీ తెలిపారు. చోరీ కేసును ఏడు రోజుల్లో ఛేదించిన ఎస్సై తిరుపతిని, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ వినోద్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది లక్ష్మారెడ్డి, చారి, లయక్ ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్‌కు మంత్రి పరామర్శ

నేరడిగొండ: నేరడిగొండ మండలం తర్నం గ్రామానికి చెందిన నిర్మల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి తండ్రి ఎర్ర గంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, నిర్మల్ ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, నాయకులు గాదె శంకర్, డాక్టర్ జహీర్, శివారెడ్డి, విశాల్, అడెల్లు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యం

- ఒకరిది ఆత్మహత్య... మరొకరిది ప్రమాదం
- ఇద్దరివి మిస్సింగ్ కేసులే



ఠాకూర్ తులసీరాం(ఫైల్) నామద్కర్ దిలీఫ్(ఫైల్)

కుభీర్: మండలంలోని జుమ్డా గ్రామానికి చెందిన ఠాకూర్ తులసీరాం(60), పాంగ్ర గ్రామానికి చెందిన నామద్కర్ దిలీప్ (24) ఇద్దరు కనిపించకుండా పోయినట్లు కుటుంబీకులు వేర్వేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. వారి మృతదేహాలను బుధవారం పోలీసులు గుర్తించారు.

కొడుకు మరణం జీర్ణించుకోలేక..
మండలంలోని జుమ్డా గ్రామానికి చెందిన ఠాకూర్ తులసీరాం(60) అతడి కుమారుడు బజరంగ్‌సింగ్ రెండేళ్ల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. ఫిబ్రవరి 22న బంధువుల పెళ్లికి వెళ్లాడు. ఆ మరుసటి రోజు నుంచి కనిపించకుండా పోయాడు. గత నెల 24న బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం చొండి శివారులో చెట్టుకు ఉరేసుకుని శవం కనిపించడంతో సమాచారం మేరకు పోలీసులు చేరుకుని తులసీరాం మృతదేహంగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి...
పాంగ్ర గ్రామానికి చెందిన నామద్కర్ దిలీఫ్ (24) గత నెల 8న బహిర్భూమికి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబీకులు ఆ మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. బుధవారం పాంగ్ర చెరువులో మృతదేహం కనిపించింది. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి దిలీఫ్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి మృతి


మార్శెట్టి శ్రీలత (ఫైల్)

జైనథ్: మండలంలోని బెల్లూరి గ్రామానికి చెందిన మార్శెటి బాపన్న, వితాబాయిల చిన్న కూతురు మార్శెట్టి శ్రీలత (22) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం... శ్రీలత తన అక్కా, బావలతో కలిసి మహారాష్ట్రలోని పాటన్‌కు పుట్టిన రోజు వేడుకల కోసం మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో అక్క భర్త తోట మహేష్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా చీకటి పడడంతో రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీలత తల భాగంలో తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఖానాపూర్ నుంచి కడెం వైపు వస్తుండగా ధర్మాజీపేట్ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడిది మామడ మండలం దిమ్మదుర్తిగా సమాచారం.


సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. వివరాల ప్రకారం...హోలీ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు అదే కాలనీ చెందిన బొట్టు రాకేష్ కుటుంబంపై దాడి చేశారు. ఇందులో రాకేశ్, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పవర్‌భరత్, నవడే ప్రభు, రామేశ్వర్, పవార్ సాయి కృష్ణ అనే నలుగురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న


నేలకొరిగిన పంట చూపుతున్న రైతు దిగంబర్


నేలకొరిగిన దొంతుల గంగాధర్ పంట

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో చేతికి వచ్చిన పంట పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కుభీర్‌కు చెందిన దొంతుల గంగాధర్‌కు చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న, బాల దిగంబర్‌కు చెంది ఎకరం పంట నేలకొరిగింది. అదేవిధంగా దార్‌కుభీర్, రాజురా గ్రామాల్లోనూ మొక్కజొన్న పడిపోయినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.